RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 304 పేజీలు - 08 సోమవారం 28 సెప్టెంబర్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## పట్టాలు ఎక్కిన తొలి ఎల్‌ఎన్‌జీ రైలు

- డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా డ్యూయల్ ఫ్యూయల్ సాంకేతికత




**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** దేశంలో మొట్టమొదటి ఎల్‌ఎన్‌జీడీజిల్ డ్యూయల్ ఫ్యూయల్ డెము రైలు ఆదివారం పట్టాలెక్కింది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) ఈ రైలును అభివృద్ధి చేసింది.గుజరాత్‌లోని సబర్మతి రైల్వే స్టేషన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జెండా ఊపి రైలును ప్రారంభించారు.

మిగతా2లో...

## యూపీలో భారీ వర్షాలు.. 56 మంది మృతి

- పలు జిల్లాల్లో వరద పరిస్థితి.. వెయ్యికి పైగా ఇళ్లకు నష్టం



**తొలి అక్షరం/హైదరాబాద్, 27:** ఉత్తరప్రదేశ్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షాలు, ఈదురుగాలులకు సంబంధించిన ఘటనల్లో శుక్రవారం నుంచి 56 మంది మృతి చెందగా, 46 మంది గాయపడ్డారు.భారీ వర్షాలతో రహదారులు, గ్రామాలు నీట మునిగాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మిగతా2లో...

## ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం: మోదీ

- సర్జికల్ స్ట్రైక్స్‌కు పదేళ్లు.. ఉగ్రవాదానికి దీటైన సమాధానం ఇస్తామని స్పష్టం



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ఉగ్రవాదంపై భారత్ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తోందని మోదీ స్పష్టం చేశారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద చర్యలకు పాల్పడితే బలమైన, నిర్ణయాత్మక సమాధానం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం

మిగతా2లో...

## ఏపీ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు

- మిగులు పోస్టుల సర్దుబాటుతో 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కల్పన



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ఆంధ్రప్రదేశ్‌లో వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 244 ద్వారా వార్డు సచివాలయ సిబ్బందికి పదోన్నతి అవకాశాలను మరింత సులభతరం చేసింది.వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు కొత్తగా సృష్టించిన జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో పదోన్నతులు కల్పించనున్నారు. మిగులు పోస్టులను సర్దుబాటు చేయడం ద్వారా మునిసిపల్

మిగతా2లో...




## 'సర్'ను రద్దు చేయండి

ఎన్నికల సంఘం పనితీరుపై దర్యాప్తునకు ఆదేశించండి

సీజేఐకి 2 వేల మందికి పైగా పౌరుల బహిరంగ లేఖ

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై విచారణ జరిపించాలని కోరుతూ 2 వేల మందికి పైగా పౌరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విద్యావేత్తలు, న్యాయవాదులు, మాజీ అధికారులు, సామాజిక కార్యకర్తలు,

మిగతా2లో...

## భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

- 8 వేల ఎకరాల వ్యవహారంపై ఆధారాలు బయటపెట్టాలి.. సిరిసిల్ల పర్యటనలో రాజకీయ విమర్శలకు కాకుండా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు (కేటీఆర్) ఆయనకు బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న ఆరోపణలపై ప్రభుత్వం పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే 2,400 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్న నేపథ్యంలో ఆ భూములకు సంబంధించిన మండలం, గ్రామం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను

మిగతా2లో...



## ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం తొలగింపు

- వివాదం నేపథ్యంలో ఉత్తర్వులు ఉపసంహరించుకున్న తమిళనాడు ప్రభుత్వం

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** తమిళనాడులో పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు చట్టం పరిధి నుంచి మినహాయిస్తూ సెప్టెంబరు 21న జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉపసంహరించు కుంది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) కింద శాంతిభద్రతల విభాగాన్ని 'ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్'గా పేర్కొంటూ మినహాయింపు ఇచ్చారు. దీనిపై పలు వర్గాల నుంచి విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ విభాగం మత,

మిగతా2లో...

## నవంబర్ 19న ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం

-రూ.5 లక్షల బీమా సౌకర్యం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** రాష్ట్ర ప్రజలకు మరింత భద్రత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నవంబర్ 19న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించే 'ఇందిరమ్మ భీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు నెలకు ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని

మిగతా2లో...

## 33 జిల్లాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- వచ్చే ఏడాది 2.5 లక్షల మందితో గిన్నిస్ రికార్డు లక్ష్యం




## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు

- రాహుల్ గాంధీ వ్యాఖ్యలు రాజ్యాంగ సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉన్నాయంటూ విమర్శ



# ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసారమైన 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో 2016లో నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్‌ను ప్రస్తావిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 2016 సెప్టెంబరు 2829 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖను దాటి ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిందని మోదీ గుర్తుచేశారు. ఉరీలోని సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. సర్జికల్ స్ట్రైక్స్ భారత ఉగ్రవాద వ్యతిరేక విధానంలో కొత్త దిశను ప్రపంచానికి చూపించాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌కు పదేళ్లు పూర్తికానున్న నేపథ్యంలో మోదీ ఈ విషయాలను ప్రస్తావించారు. గత దశాబ్దంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసిందని మోదీ అన్నారు. 2019లో బాలాకోట్ వైమానిక దాడి, 2025లో ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను కూడా ఆయన ప్రస్తావించారు. ఉగ్రవాదులు భారత్‌పై దాడికి పాల్పడితే దీటైన ప్రతిస్పందన ఉంటుందనే సందేశాన్ని ఈ చర్యల ద్వారా ఇచ్చినట్లు మోదీ పేర్కొన్నారు. మునుపటి సంవత్సరాల్లో దేశం ఎదుర్కొన్న ఉగ్రదాడులను కూడా ప్రధాని గుర్తుచేశారు. 2008 సెప్టెంబరు 13న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లు, అనంతరం జరిగిన ముంబై 26/11 ఉగ్రదాడులను ప్రస్తావించారు. ఉగ్రవాదం కారణంగా దేశం చాలాకాలం తీవ్ర నష్టాన్ని చవిచూసిందని పేర్కొంటూ, ప్రస్తుత విధానం ఉగ్రవాదానికి గట్టి సమాధానం ఇవ్వడంపై దృష్టి సారించిందని తెలిపారు. **జనగణనలో ప్రజల భాగస్వామ్యం** 'మన్ కీ బాత్'లో జనగణన అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు.

జనగణనను జాతీయ బాధ్యతగా పేర్కొన్న ఆయన.. ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ స్వీయ గణన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. **పర్యావరణం, యువతపై ప్రస్తావన** పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పరిశుభ్రత, పోషకాహారం, యువత, క్రీడలు, సాంస్కృతిక వారసత్వం వంటి పలు అంశాలను కూడా ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. అసోంలో పిగ్మీ హాగ్ సంరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలను అభినందించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో యువత చురుకుగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

# 'సర్'ను రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పాత్రికేయులు, మాజీ సైనిక అధికారులు తదితరులు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులకు బహిరంగ లేఖ రాశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తలెత్తినట్లు వారు పేర్కొంటున్న అంశాలపై కోర్టు స్వయంగా దృష్టి సారించాలని కోరారు. ఎన్నికల సంఘంలో అంతర్గతంగా విభేదాలు ఉన్నాయన్న వార్తల నేపథ్యంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఓటర్ల నమోదు దరఖాస్తు పత్రాల్లో మార్పులు, ఓటర్ల సమాచారానికి సంబంధించిన డిజిటల్ వ్యవస్థలపై కేంద్రీకృత నియంత్రణ వంటి అంశాలపై కూడా వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే ఇవి లేఖలో సంతకం చేసిన వారి ఆరోపణలు మాత్రమేనని, వాటిపై తుది న్యాయపరమైన నిర్ధారణ జరగాల్సి ఉంది. ఎస్ఐఆర్ ప్రక్రియకు తాత్కాలికంగా నిలుపుదల విధించాలని, ఎన్నికల సంఘం పనితీరుపై స్వతంత్రంగా విచారణ జరిపించాలని వారు కోరినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఎన్నికల సమాచారానికి సంబంధించిన కీలక డేటాబేస్‌లు, రికార్డులు, లాగ్‌లను భద్రపరచాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, ఎస్ఐఆర్ వ్యవహారంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న మీడియా కథనాలను ఆధారంగా చేసుకుని ఈ పిటిషన్ దాఖలైనట్లు సమాచారం. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఈసీఐనెట్, ఈఆర్ఓనెట్ డేటాబేస్‌లపై సాంకేతిక, ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కూడా పిటిషన్‌లో కోరారు. ఎన్నికల జాబితాల సవరణపై రాజకీయంగా ఇప్పటికే తీవ్ర చర్చ జరుగుతున్న నేపథ్యంలో 2 వేల మందికి పైగా పౌరులు సుప్రీంకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ఎన్నికల సంఘం, సంబంధిత అధికారుల వాదనలతో పాటు న్యాయస్థానం పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ అంశంపై న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోంది.

# భూ ఆరోపణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు వెల్లడించాలని కోరారు. భూ ఆక్రమణలపై చేసిన ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కేటీఆర్ అన్నారు. ఆరోపణలకు ఆధారాలు లేకపోతే ముఖ్యమంత్రి సిరిసిల్ల ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తన లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను ప్రజల ముందుంచాలని, భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్న ప్రక్రియలో పాల్గొన్న అధికారుల వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. **నేతన్నల బకాయిలపై ప్రశ్నలు** సిరిసిల్ల నేతన్నల సమస్యలపై కూడా కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేనేత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 60 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నేతన్నలకు గతంలో అమలు చేసిన రూ. 5 లక్షల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, మూతపడిన చేనేత పార్కు కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ చీరల పథకం నిలిచిపోవడం, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన ఆర్డర్లు తగ్గడం వల్ల నేతన్నలకు ఉపాధి అవకాశాలు తగ్గాయని ఆయన పేర్కొన్నారు. **రైతుల సమస్యలపైనా స్పష్టత కోరిన కేటీఆర్** సిరిసిల్ల నియోజకవర్గ రైతులకు సంబంధించిన రైతుబంధు బకాయిలు, రూ. 2 లక్షల రుణమాఫీ, రైతుబీమా అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల నియోజకవర్గంలోని సుమారు 56 వేల మంది రైతులకు రూ. 532 కోట్ల మేర పెట్టుబడి సాయం అందిందని ఆయన పేర్కొన్నారు.

ఎకరాకు రూ. 15 వేల సాయం చేస్తామని ఇచ్చిన హామీ అమలు ఎప్పటి నుంచి జరుగుతుందో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సిరిసిల్ల ప్రాంతానికి కొత్త పరిశ్రమలు, ఆక్వా హబ్, ఆహార శుద్ధి పరిశ్రమల మండలి వంటి ప్రతిపాదనల పురోగతిపై కూడా ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలని కోరారు. మల్కపేట జలాశయం నుంచి అప్పర్ మానేరు వరకు నీటిని తరలించే అంశంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని పేర్కొన్నారు. **హామీల అమలుపై తేదీలు ప్రకటించాలి** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. మహాలక్ష్మి పథకం, పింఛన్ల పెంపు, రైతులకు సంబంధించిన హామీలు, దళితబంధు, బీసీ బంధు తదితర సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన తేదీలను ప్రకటించాలని కోరారు.

సిరిసిల్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిరిసిల్ల పర్యటనలో స్థానిక సమస్యలకు సమాధానాలు ఇవ్వాలని, రాజకీయ విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజలకు సంబంధించిన అంశాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ తన లేఖలో కోరారు. భూ ఆరోపణలకు సంబంధించిన పూర్తి ఆధారాలను ప్రభుత్వం బహిర్గతం చేస్తే, తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలను ఎదుర్కోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

# దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం

**పెండింగ్‌లోని యూఎల్‌సీ దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు.. అర్హమైన కేసుల క్రమబద్ధీకరణకు చర్యలు**

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూ సమస్యలకు పరిష్కారం చూపేం దుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెండిం గ్ దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హత ఉన్న కేసులను క్రమబద్ధీకరించేందుకు అధికా రులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ శాఖ మెమో నంబర్ 48062/ULC/A1/ 2026`1ను జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జీఓలు 455, 456, 747, 92 కింద దాఖలైన పెండింగ్ యూఎల్‌సీ దరఖాస్తులను పరిశీలించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం అర్హత ఉన్న కేసులను సంబంధిత నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని సూచించారు. ఈ నిర్ణయంతో సంవత్సరాల తరబడి భూ హక్కులు, రిజిస్ట్రేషన్లు తదితర అంశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దరఖాస్తుదారులకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది. 2016లోనే యూఎల్‌సీ సమస్యల పరిష్కారానికి అప్పటి ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కాలేదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



దీంతో వేలాది దరఖాస్తులు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని, ఫలితంగా భూముల హక్కులు, లావాదేవీల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. **22-ఏ సమస్యలపైనా దృష్టి** భూ సమస్యలతో పాటు రిజిస్ట్రేషన్ చట్టంలోని 22-ఏ సెక్షన్‌కు సంబంధించిన సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు 22-ఏకు సంబంధించిన పలు సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కూడా ఉత్తర్వులు జారీ చేసినట్లు పొంగులేటి చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ లేదా సంబంధిత పురపాలక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే అనుమతులు ఉన్న ఆస్తులు 22-ఏ జాబితాలో ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. యూఎల్‌సీతో పాటు మిగిలిన 22-ఏ సమస్యలను కూడా వేగంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. అర్హత, పత్రాల పరిశీలన, చట్టపరమైన నిబంధనల ఆధారంగానే కేసులను పరిష్కరించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## పట్టాలు ఎక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు

(మొదటి పేజీ తరువాయి)

సబర్మతిమహేసన జంక్షన్ మధ్య ఈ రైలు నడవనుంది. 62 కిలోమీటర్ల దూరాన్ని సుమారు గంటా 20 నిమిషాల్లో చేరుకోనుంది. ఎల్ఎన్‌జీ అందుబాటులో లేని పరిస్థితుల్లో డీజిల్‌కు మారేలా ఈ రైలును రూపొందించారు. మొత్తం ఎనిమిది నాన్-ఏసీ చైర్‌కార్ కోచ్‌లు ఉన్నాయి. రైలును ప్రారంభించే ముందు 2 వేల కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయి ట్రయల్స్ నిర్వహించారు. ఎల్ఎన్‌జీ వినియోగంతో డీజిల్ వినియోగం, కర్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

## యూపీలో భారీ వర్షాలు.. 56 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

వెయ్యికి పైగా ఇళ్లు దెబ్బతినగా, పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలు సహాయక చర్యలు చేపట్టి, చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. వర్షాల తీవ్రత కొంత తగ్గినప్పటికీ పలు జిల్లాల్లో వరద పరిస్థితి కొనసాగుతోంది. సహాయక చర్యలను అధికారులు ముమ్మరం చేశారు.

## ఏపీ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు

(మొదటి పేజీ తరువాయి)

అడ్మినిస్ట్రేషన్ శాఖలో 815 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులకు మార్గం సుగమం కానుంది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు పదోన్నతులు కల్పించిన అనంతరం, వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించే అవకాశం ఏర్పడింది. దీంతో వివిధ కేడర్లలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా ఉద్యోగోన్నతి ప్రయోజనాలు అందనున్నాయి. అదేవిధంగా 815 వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను గ్రేడ్-1గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సంఖ్యలో ఉన్న వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీ గ్రేడ్-2 పోస్టులను కూడా గ్రేడ్-1గా ఉన్నతీకరించింది. ఈ మార్పుల ద్వారా సిబ్బంది పదోన్నతులకు అవసరమైన కేడర్ నిర్మాణాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. మిగులు పోస్టులను సర్దుబాటు చేయడం ద్వారా ఈ ప్రక్రియను చేపట్టినందున ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం లేకుండా పోస్టుల పునర్వ్యవస్థీకరణ పూర్తి చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో వార్డు సచివాలయ ఉద్యోగుల్లో పదోన్నతులపై నెలకొన్న నిరీక్షణకు తెరపడినట్లయింది.

## నవంబర్ 19న ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. రైతులకు ఎకరానికి రూ. 12 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు.

ఇందిరమ్మ భీమా పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

## ఆర్టీఐ పరిధి నుంచి శాంతిభద్రతల విభాగం తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

కుల ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసు కాల్పులు, కస్టడీ మరణాలు, పోలీసు వేధింపులు, నిర్బంధ కేసులు తదితర అంశాలకు సంబంధించిన వ్యవహారాలను పరిశీలిస్తుంది. తాజా ఉత్తర్వులతో ఈ విభాగం ఆర్టీఐ పరిధిలోనే కొనసాగనుంది.

## 33 జిల్లాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ జాగృతి ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది అన్ని జిల్లాలతో పాటు పలు దేశాల్లోనూ బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆదివారం బతుకమ్మ వేడుకల పోస్టర్, సంప్రదాయ బతుకమ్మ, చప్పట్ల పాటలతో రూపొందించిన సీడీని ఆమె ఆవిష్కరించారు. బతుకమ్మను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామస్థాయిలో బతుకమ్మ, కోలాటం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు కవిత వెల్లడించారు. ఇప్పటికే పలు జిల్లాలు, దేశాల్లో కమిటీలను ఏర్పాటు చేశామని, మిగిలిన ప్రాంతాల్లోనూ త్వరలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది సుమారు 2.5 లక్షల మందితో భారీ బతుకమ్మ వేడుకలు నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడమే లక్ష్యంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు కవిత తెలిపారు. గతంలోనూ బతుకమ్మను అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యంలోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ జాగృతి కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. అయితే వచ్చే ఏడాది నిర్వహించనున్న కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించేందుకు ప్రతిపాదించిన కార్యక్రమమేనని, రికార్డు ఇప్పటికే సాధించలేదని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ సంప్రదాయ పాటలు, చప్పట్ల పాటలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సీడీని కూడా విడుదల చేశారు. సంప్రదాయ కళలు, పాటలను పరిరక్షించడంతో పాటు మహిళల భాగస్వామ్యాన్ని పెంచేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఈసీపై కాంగ్రెస్ ఆరోపణలను కిషన్‌రెడ్డి ఖండించారు

**తొలి అక్షరం/హైదరాబాద్, సెప్టెంబర్ 27:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేయడంపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రాహుల్ గాంధీ ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నించడం, సీఈసీ రాజీనామా చేయాలని కోరడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల సంఘం సక్రమంగా పనిచేస్తోందని, ఓటమి ఎదురైనప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేయడం ఏమిటని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ఏ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పనిచేయదని, ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కూడా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. మృతుల పేర్లు, నకిలీ లేదా రెండుసార్లు నమోదైన పేర్లు, తప్పులున్న వివరాలను సరిచేయడం ఓటర్ల జాబితా శుద్ధీకరణలో భాగమని ఆయన అన్నారు. ఈ ప్రక్రియ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కొనసాగుతోందని పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటర్ల హక్కులకు భంగం కలిగే ప్రమాదం ఉందంటూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పనితీరుపై కాంగ్రెస్ నేతలు ఇటీవల తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సీఈసీని తొలగించాలని డిమాండ్ చేయగా, ఎన్నికల ప్రక్రియపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపిం చారు. ఎన్నికల సంఘం వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు అవసరమని ఆయన కోరారు. మరోవైపు, ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలపై వస్తున్న వార్తలను కిషన్‌రెడ్డి ప్రస్తావిస్తూ.. ఎన్నికల కమిష నర్లు పరస్పరం చర్చించుకోవడం, లేఖలు రాయడం సహజమైన ప్రక్రియేనని అన్నారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సమావేశమై తమ మధ్య విభేదాలు లేవని స్పష్టం చేశారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రతిపక్షాలు అనవసర వివాదంగా మార్చకూడదని ఆయన అన్నారు.

# ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),సెప్టెంబర్27:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆదివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి ఏఐజీ (అడ్మిన్) జె.అన్యోన్య పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు.స్వాతంత్ర్య సమరయోధుడిగా,ప్రజానాయకుడిగా సామాజిక న్యాయం,అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం కృషి చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన వయసును సైతం లెక్కచేయకుండా ఉద్యమించిన ఆయన త్యాగం, నిబద్ధత చిరస్మరణీయమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐజీ (అడ్మిన్) జె.అన్యోన్యతో పాటు స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ,ఇతర పోలీసు అధికారులు,డీజీపీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్

**చదరంగంతో మేధో వికాసం..**

**సీఐ సీతారాం ప్రత్యేక సందేశం**

**గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్‌కు విశేష స్పందన**

**చెస్‌తో ఆలోచన శక్తి పదును.. సీఐ సీతారాం**








**తొలి అక్షరం/షాద్ నగర్, సెప్టెంబర్ 27:** చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల్లో ఆలోచన శక్తి, ఏకాగ్రత, మేధో వికాసం పెరుగుతాయని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం అన్నారు. ఆదివారం పట్టణంలోని పతంజలి యోగ సెంటర్‌లో షాద్‌నగర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తొలిసారి గణేష్ ఉత్సవ చెస్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. చెస్ మాస్టర్ వారణాసి జగన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు సీఐ సీతారాం ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.అండర్-8 విభాగంలో సాయి సారిష్, రియాన్స్, సాయి కార్తీక్‌రెడ్డి; అండర్-10లో శ్రీమాన్‌రెడ్డి, ఆయుష్, సిద్దార్థ్ లక్ష్మణ్; అండర్-12లో శ్రీ హర్షిత్, వేదాదిత్య, నిహాల్‌రెడ్డి; అండర్-14లో భానుతేజ, సాత్విక్, శ్రీకర్; అండర్-16లో అద్వైత్, సాత్విక్, గౌతమ్ బహుమతులు అందుకున్నారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెస్ కేవలం వినోదం కోసం ఆడే ఆట కాదని, ప్రతి ఎత్తును ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ద్వారా విద్యార్థుల్లో మేధో సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే చెస్‌పై ఆసక్తి పెంచుకుంటే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మేధో క్రీడలను ప్రోత్సహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ మణికంట,సర్పంచులు కృష్ణవేణి హరినాయక్,బాబు నాయక్, శ్రీకాంత్ యాదవ్, శేఖర, కుంఫు మాస్టర్ హైమద్ ఖాన్,సునీత, రవికుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం తీరుపై కాంగ్రెస్ నేత ధైద రవీందర్ ఆందోళన



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 27:** ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రశ్నార్థకంగా మారడం ప్రజాస్వామ్యానికి ఆందోళనకరమని నకిరేకల్ కాంగ్రెస్ నేత ధైద రవీందర్ అన్నారు. గోవాలో 97 మంది ఓటర్ల సమస్యపై స్పందిస్తూ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదని అన్నారు. ఎన్నికల సంఘం కమిషనర్లే గత 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు తెలపడం ఆందోళనకరమని అన్నారు.

# కోనిజర్ల మండల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన కమిటీ ఎన్నిక

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా జిల్లా మహేష్ మాదిగ**

**ఎంఎస్‌పి మండల అధ్యక్షులుగా కొర్ల కంటి రవికుమార్ మాదిగ**



**తొలి అక్షరం/కొణిజర్ల సెప్టెంబర్ 27:** పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు ది 27 /9 /26 ఆదివారం కొనిజర్ల మండల ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కందికట్ల విజయ్ మాదిగ, ఎం ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు తురుగంటి అంజయ్య మాదిగ పాల్గొని నూతన కమిటీని ఎన్నిక చేశారు. కొనిజర్ల మండల ఎంఆర్పిఎస్ అధ్యక్షులుగా జిల్లా మహేష్ మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులుగా కొర్ల కంటి రవికుమార్ మాదిగ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయ్ మాదిగ, అంజయ్య మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశానుసారం మండల కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతా ఉందని, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల కోసం బడుగు బలహీన వర్గాల వారి కోసం పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఎన్నో పోరాటాలను చేసి అదేవిధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో ప్రభుత్వ పాత్ర పోషించి వర్గీకరణను సాధించటం జరిగింది. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల కోసం వారికి రాజ్యాధికారం రావాలనే సంకల్పంతో గ్రామ కమిటీలను మండల కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, మండలంలో ఉన్న మాదిగలంతా కూడా ఒక తాటిపై కొచ్చి కృష్ణ మాదిగ ఏ పిలుపు ఇచ్చినా సరే ఆ ఉద్యమంలో ప్రతి ఒక్కరు కూడా పాల్గొనాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ పగిడి కత్తుల ఈదయ్య మాదిగ, కొనిజర్ల మండల ఇంచార్జ్ జొన్నలగడ్డ రవికుమార్ మునిష్ మాదిగ, కొనిజర్ల మండల ఎం ఎస్ పి మాజీ అధ్యక్షులు చాట్ల భాస్కరరావు మాదిగ, ఎంఆర్పిఎస్ కొనిజర్ల మండలం మాజీ అధ్యక్షులు ఇలారపు మురళి మాదిగ , ఎం ఈ ఎఫ్ జిల్లా నాయకులు తేలూరి యాదగిరి మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గొడ్డు గొర్ల నాగయ్య మాదిగ, కిన్నెర వెంకటేశ్వర్లు మాదిగ, తడికమల్ల బసవయ్య మాదిగ, తడికమల్ల తిరుపతిరావు మాదిగ, భద్రయ్య మాదిగ జయరాం మాదిగ, బెల్లంకొండ కృష్ణ మాదిగ బోరా సుధాకర్ మాదిగ పాపగంటి నాగేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొని ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన రామన్నపేట బీజేపీ నాయకులు



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 27:** హైదరాబాద్ లోని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో రామన్నపేట బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రామన్నపేటలో గతంలో ఆపివేసిన నారాయణాద్రి, ఫలక్‌నుమా, పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కిషన్ రెడ్డి సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడి త్వరలోనే రైళ్లు ఆగే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, సికింద్రాబాద్ ఇంచార్జ్ వీరెల్లి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నకిరేకంటి మొగులయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్, మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఒంటరి వృద్ధ మహిళ దారుణ హత్య

**● సుమారు 8 తులాల బంగారం అపహరణ?**

**తూప్రాంపేట్‌లో కలకలం**



**తొలి అక్షరం/చౌటుప్పల్: సెప్టెంబర్ 27:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాంపేట్ గ్రామ శివారులో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ మహిళ దారుణ హత్యకు గురైంది. మంటిపల్లి యాదమ్మ (70) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర కలకలం నెలకొంది.యాదమ్మను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి, ఆమె వద్ద ఉన్నట్లు భావిస్తున్న సుమారు 8 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు ప్రాథమిక సమాచారం. అయితే బంగారం చోరీకి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హత్య జరిగిన తీరును పరిశీలించడంతో పాటు, మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికులను విచారిస్తున్నారు. యాదమ్మ హత్యకు గల కారణాలు, ఘటనలో ఎంతమంది పాల్గొన్నారు, బంగారం అపహరణ జరిగిందా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ మహిళ హత్యకు గురికావడం తూప్రాంపేట్ పరిసర ప్రాంతాల్లో ఆందోళనకు కారణమైంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా మొక్క నాటిన మాజీ సర్పంచ్

**- అంతర్జాతీయ అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య.**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 27:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గుండ్రపల్లి గ్రామ తొలి మహిళా మాజీ సర్పంచ్ పరకాల సుగుణమ్మ సారయ్య వారి చేతుల మీదుగా వారి ఇంటి ఆవరణంలో అంతర్జాతీయ అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య నూరు వరాల పూల మొక్కను నాటించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పరకాల సుగుణమ్మ సారయ్య లు మాట్లాడుతూ గుండ్రపల్లి గ్రామంలో పుట్టి పెరిగి పశు వైద్యం నేర్చుకుని కొన్ని వేల సంవత్సరముల నుండి పలు గ్రామాలు తిరుగుతూ రైతులకు అందుబాటులో ఉంటూ కొన్ని రకాల మేలు జాతి పశు దూడలను సృష్టించడం గొప్ప విషయం అన్నారు. అంతేకాకుండా నిరంతరం పర్యావరణం పరిరక్షణ కొరకు పాటుపడుతూ రకరకాల కొన్ని వేల మొక్కలను నాటిన మొక్కలను సంరక్షించి చెట్లను పెంచడం వలనప్రజలకు పక్షులకు జంతువులకు మంచి గాలి, నీడ ఫలములు అందిస్తున్నవి. ఇతను అధికారులతో అనధికారులతో మన్నలను పొంది కొన్ని అవార్డులను అందుకోవడం జరిగింది. ఇతను సేవ దేశానికి ఆదర్శనీయమని మా గ్రామ ప్రజలందరికీ పేరు ప్రతిష్టలు తెస్తున్నందుకు సంతోషంగా ఉందని సమ్మయ్యను అభినందించారు. ఇతని సేవలను ప్రభుత్వం గుర్తించి సహాయ సహకారాలు అందిస్తే కొన్ని వేల మొక్కలు నాటినవి పెరిగిన చెట్లు కాకుండా కొన్ని లక్షలలో మొక్కలను నాటి చెట్లను పెంచగలరని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వనప్రేమికుడు సమ్మయ్య మాట్లాడుతూ నాటిన ఈ పూల మొక్క ఎదిగి పూలు వికసించాలని భగవంతుని ప్రార్థించారు. అణచివేతకు ఎదురిండి ఆత్మగౌరాన్ని ఆయుధంగా మార్చిన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులర్పించారు.

# ఘనంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలు



**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 27:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా చేనేత వృత్తిదారులు, కార్మికులు, పద్మశాలీలు ఘనంగా నిర్వహించారు.మండలంలోని వెల్లంకి గ్రామంలో గ్రామ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం బాపూజీ జయంతిని పురస్కరించుకుని గట్టుప్పల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అప్పం లక్ష్మయ్య, ఆయన మనవరాలు నిహారిక పుట్టినరోజు సందర్భంగా మానవతా కార్యక్రమం చేపట్టారు. నిరుపేద వితంతు మహిళలైన మిర్యాల అంజలి, ఈపూరి సునితలకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని కొండా లక్ష్మణ్ బాపూజీ ట్రస్ట్ కార్యనిర్వాహకులు కొంగరి జానయ్య, చేనేత సహకార సంఘం అధ్యక్షులు మిర్యాల ఉపేందర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు వనం పురుషోత్తం, రుద్ర వెంకటేశం, శంభు లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు గంజి నరసింహ, వనం సత్తయ్య, గంజి లక్ష్మయ్య, వనం నర్సింహ, వనం వెంకటేశం, రావేటి రమేశ్, రావేటి సతీష్, కొంగరి నిరంజన్, మిర్యాల సత్తయ్య, చిక్క బాబూరావు, గజం భాస్కర్, వనం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
# ఆప్యాయ పలకరింపులు

**సామాన్యుడిలా బల్లపై కూర్చొని**

**టీ తాగిన డిప్యూటీ సీఎం!**

**ముదిగొండ టీ స్టాల్ వద్ద డిప్యూటీ**

**సీఎం భట్టి విక్రమార్క ముచ్చట్లు**







**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27:** అధికార గర్వం లేని ఆత్మీయత, ప్రజా నాయకుడికి ఉండాల్సిన నిజమైన నిరాడంబరత ముదిగొండ మండల కేంద్రంలో శనివారం ఆవిష్కృతమైంది. మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన హోదాను పక్కనబెట్టి, అత్యంత సాధారణ మానవుడిలా ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రజల మధ్యన గడిపారు. ముదిగొండ సెంటర్‌లోని 'నీల్ కమల్ టీ స్టాల్' వద్ద కాన్వాయ్‌ను ఆపిన డిప్యూటీ సీఎం, అక్కడ ఉన్న బల్లపై కూర్చొని ప్రశాంతంగా టీ తాగారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి స్వయంగా తమ ముందుకు వచ్చి సామాన్యుడిలా టీ తాగుతుండడం చూసి స్థానికులు, ప్రయాణికులు ఆశ్చర్యానందాలకు లోనయ్యారు. ఆయనను చూసేందుకు, మాట్లాడేందుకు జనం పోటీ పడగా, యువత ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరిస్తూ భట్టి విక్రమార్క అందరి మనస్సులను గెలుచుకున్నారు.

**ప్రజా సంక్షేమంపై ప్రత్యక్ష ఆరా**

టీ స్టాల్ పరిసరాల్లో ఉన్న మహిళలను ఆప్యాయంగా పలకరించిన డిప్యూటీ సీఎం, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారి బానోతు రాంజీ, కూరగాయల వ్యాపారి నరసమ్మలను పలకరించి, ముదిగొండలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులపై అభిప్రాయం అడిగారు. "సార్, మునుపటి కంటే ఇప్పుడు రోడ్డు వెడల్పు కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది" అని నరసమ్మ సంతోషం వ్యక్తం చేశారు. కాగా, విస్తరణలో ఇండ్లు కోల్పోయామని కొందరు ఆయన దృష్టికి తేగా, "ఎవరూ ఆందోళన చెందవద్దు, ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున ఇండ్లు ఇస్తాం" అని భరోసా ఇచ్చారు. రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే పల్లె నాగభూషణంను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పలకరించి కులవృత్తి, కుటుంబ పోషణ గురించి అడిగారు. దుమ్ము ధూళితో ఇబ్బంది పడుతున్నానని, ఆర్థిక సహకారం అందిస్తే చిన్న డబ్బా ఏర్పాటు చేసుకుంటానని నాగభూషణం కోరగా... ఆయన కుమారుడు పల్లె సురేష్ పేరిట 'రాజీవ్ యువ వికాసం' కింద రూ. లక్ష వరకు రుణ సహాయం అందిస్తామని మాట ఇచ్చారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఎంగ్రోటి యశోద అనే నిరుపేద మహిళ ఇద్దరు ఆడపిల్లలతో అద్దె ఇంట్లో పడుతున్న కష్టాలను వివరించగా, తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎం... రాబోయే 'ఇందిరమ్మ ఇండ్ల' జాబితాలో ఆమెకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని అక్కడే ఉన్న సర్పంచ్‌ను ఆదేశించారు.

**అభివృద్ధి పనుల ఆకస్మిక తనిఖీ**

అనంతరం ముదిగొండలో రూపుదిద్దుకుంటున్న 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (జనజ) నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దానితో పాటు పట్టణంలో శరవేగంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ఒకే రోజు నియోజకవర్గ అభివృద్ధి పనులను సమీక్షిస్తూనే, మరోవైపు సామాన్య ప్రజల కష్టాలను ఆలకించి అక్కడికక్కడే పరిష్కరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీరుపై ముదిగొండ ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు







**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 27:** కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను రామన్నపేట మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయన ఆశయాలు, సమాజ అభ్యున్నతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు సంగిశెట్టి సుదర్శన్, పద్మశాలి సంఘం అధ్యక్షులు ఈడెం శ్రీనివాసరాధా, మాజీ డిసిఎంఎస్ జిల్లా డైరెక్టర్ జెల్లా వెంకటేష్, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి, కార్యదర్శి నాగభూషణం, పున్న వెంకటేశం, వనం చంద్రశేఖర్, మండల చేనేత సహకారసంఘాల అధ్యక్షుడు పెండం వేణు, వరం సుధాకర్, వనం కిష్టయ్య, జిల్లా దత్తాత్రి, దొంత నాగరాజు, సూర్య పెల్లి చంద్రమోహన్, గంజి అశోక్, వనం విటల్, రచ్చ దయాకర్, గంజి చంద్రయ్య, పాండు, భవనాఋషి, బోడ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సదస్సుకు హాజరైన రామన్నపేట ఉద్యమకారులు





**తొలి అక్షరం/రామన్నపేట సెప్టెంబర్ 27:** ఆదివారం రోజున యాదగిరిగుట్టలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ రాష్ట్ర ఆవిర్భావ సదస్సుకు రామన్నపేట మండలానికి చెందిన ఉద్యమకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి, సదస్సును విజయవంతం చేశారు. అనంతరం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని, తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె చాంద్, మండల అధ్యక్షులు నోముల శంకర్, మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, మండల నాయకులు చిందం లింగయ్య, గడ్డం యాదగిరి, గొలుసుల ప్రసాద్, మందడి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# అట్టహాసంగా అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకలు





**తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 27:** స్థానిక లకారం ట్యాంక్ బండ్ ప్రాంగణంలో అంతర్జాతీయ పర్యాటక దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన యువ స్కూల్, యువ కాలేజ్ పోటీల్లో గెలుపొందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా అ ట వీ అధికారి బహుమతుల ప్రదానం చేశారు. వేడుకల్లో కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే సంగీత విభావరి, న్యూ విజన్ హైస్కూల్ విద్యార్థిని భాగ్య సాన్వి బృందంచే శాస్త్రీయ స్వాగత నృత్యం, జాతీయ నృత్యకారిణి లక్ష్మణ్యచే శాస్త్రీయ నృత్య ప్రదర్శన, టీజీఎస్ డబ్ల్యూడీసీ చెందిన శ్రీకళ అండ్ టీమ్ (10 మంది)చే జానపద మేళవింపు (TSWRS టీజీ డబ్ల్యూఆర్ఎస్ కుసుమంచికి చెందిన చిన్మయి బృందంచే సెమీ క్లాసికల్ డ్యాన్స్, దుర్గచే శాస్త్రీయ నృత్యం ప్రేక్షకులు ఎంతో ఉత్సాహంగా తిలకించారు. ఈ వేడుకల్లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# చలో యాదగిరిగుట్టకు తరలిన ఉద్యమకారులు



**తొలి అక్షరం/నెల్లికుదురు సెప్టెంబర్ 27:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీను ఆధ్వర్యంలో చలో యాదగిరిగుట్టలో నేడు నిర్వహించే 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేసేందుకు మండల కేంద్రం నుంచి ఆదివారం నెల్లికుదురు మండల తెలంగాణ ఉద్యమకారులు బయలుదేరారు. ఈ సందర్భంగా నేల్లికుదురు ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరికుంట్ల మౌనేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు వీరగాన్ని మల్లేశం గౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శి పెరుమాండ్ల చంద్రమౌళి, కదిర జగన్, అవిరేండ్ల రామచంద్రు యాదవ్, హెచ్ అశోక్, లు మాట్లాడుతూ ఆరోజు రాష్ట్ర ఏర్పాటు సాధన కోసం గ్రామాలలో ర్యాలీలు ధర్నాలు రాస్తా రోకో వంట వార్పు కూలి పని క్రొవ్వతుల ప్రజ్వలన ధూమ్ ధామ్ సకల జనుల సమ్మె చలో అసెంబ్లీ హైదరాబాద్ లాంటి ఎన్నో ఉద్యమాలను చేపట్టి మండల కేంద్రంలో అమరవీరుల స్థూపం కూడా నిర్మించుకుందామని అన్నారు. ఉద్యమకారుల హక్కుల సాధనకై ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతోమంది ఎన్నో రకాల ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేశామని అన్నారు. నిధులు నియమకాలు నీళ్ల ప్రాంత అభివృద్ధి కోసం ఎంతోమంది పోరాడిన చరిత్ర ఉందని అన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషిచేసిన మలిదశ ఉద్యమ నాయకులను గుర్తించాలని వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. నేడు నెల్లికుదురు మండల కేంద్రం నుంచి చలో యాదగిరిగుట్టకు తరలినట్లు చెప్పారు.



# రాచకొండ దసరా ఉత్సవాలకు శ్రీకారం

- **ఇఎల్‌వి భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణకు సన్నాహాలు**
- **29న ముఖ్య సభ్యుల సమావేశం**



**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 27:** రాచకొండ దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉత్సవాల నిర్వహణ, కార్యక్రమాల రూపకల్పన, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించేందుకు ఈ నెల 29వ తేదీన ముఖ్య సభ్యుల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి ఇ ఎల్ వి భాస్కర్ గారు స్వయంగా హాజరై సభ్యులతో ఉత్సవాల నిర్వహణపై చర్చించనున్నారు. రాచకొండ ప్రాంతంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడంతో పాటు, ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా కార్యక్రమాలను రూపొందించడంపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని, తమ సూచనలు మరియు సలహాలను అందించాలని ఇ ఎల్ వి భాస్కర్ కోరనున్నట్లు తెలిపారు. ఉత్సవాల ఏర్పాట్లలో ప్రతి సభ్యుడి భాగస్వామ్యం కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.



# హెడ్ కానిస్టేబుల్‌గా కె.రుద్రకు పదోన్నతి

**తొలి అక్షరం/బొమ్మనహల్ సెప్టెంబర్ 27:** -బొమ్మనహల్ మండల స్థానిక పోలీస్ స్టేషన్‌లో 2021 జనవరి 3న కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన కే.రుద్ర దాదాపు ఐదున్నరేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచిగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఆయనకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయం డి.ఓ. నెం.1023/2026, తేదీ 26-09-2026న హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది, పదోన్నతి అనంతరం కే.రుద్ర నూతన బాధ్యతలు స్వీకరించారు మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసుల్ మరియు ఏఎస్ఐ హనుమంత రెడ్డి, మరియు స్థానిక హెడ్ కానిస్టేబుల్ మరియు కానిస్టేబుల్స్, అందరూ కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించండి

**- పి.డి.ఎస్.యు జిల్లా సహాయ కార్యదర్శి అలువాల నరేష్**




**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 27:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో దేశంలోని నేటి విద్యార్థి, యువత భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో కుల,మత, ఆర్థిక అసమానతులకు వ్యతిరేకంగా పోరాడాలని పి.డి.ఎస్.యు. వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి అల్వాల నరేష్ పిలుపునిచ్చారు. నెక్కొండ మండల కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో భారత జాతీయోద్యమ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 119 వ, జయంతి వారోత్సవాలు (సెప్టెంబర్ 22 నుండి 28 వరకు) పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలతోనివాళి అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ రాజ్యాంగబద్ధ సంస్థలను తన జేబు సంస్థలుగా ఉపయోగించుకుంటూ దేశ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో మోడీ అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిజం, ప్రపంచ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న యుద్ధోన్మాద చర్యలు పెను ప్రమాదకరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అని అన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలను ప్రశ్నించటంలో విద్యార్థి, యువత ముందుండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నెక్కొండ మండల నాయకులు రవి, వెంకటేష్ ,సుమన్, ధీరజ్ , కోటి, మధు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఫ్రెండ్లీ కేర్

## జర్నలిస్ట్ ఐలయ్య కుటుంబానికి 10,500 ఆర్థిక సాయం 25 కిలోల బియ్యం అందజేత



**తొలి అక్షరం/పెద్దవంగర సెప్టెంబర్ 27:** గంట్లకుంట గ్రామానికి చెందిన జర్నలిస్ట్ కీ.శే. చింతల ఐలయ్య ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఆయన కుటుంబ పరిస్థితిని నమస్తే తెలంగాణ రిపోర్టర్ కొండ. సతీష్ ద్వారా తెలుసుకున్న ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పెదపూడి ప్రసన్న కుమార్ వెంటనే స్పందించారు.ఐలయ్య మృతి విషయాన్ని ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ వాట్సాప్ గ్రూప్‌లో సభ్యులకు తెలియజేయగా, సభ్యులు మానవతా దృక్పథంతో వెంటనే స్పందించారు. ఫోన్‌పే ద్వారా తమకు తోచిన విధంగా విరాళాలు అందించి మొత్తం రూ.10,500 సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఐలయ్య కుటుంబానికి అందజేశారు.అదేవిధంగా కొడకండ్ల నవీన్ శేటు 25 కిలోల బియ్యం బస్తాను అందించి కుటుంబానికి తనవంతు సహకారం అందించారు.ఈ సందర్భంగా ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ సభ్యులు, కొడకండ్ల చిన్నబడి ప్రధానోపాధ్యాయులు దొర్ణం ప్రభాకర్ మాట్లాడుతూ, ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మై రెడీమర్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. పెదపూడి ప్రసన్న కుమార్, చింతల ఐలయ్య కుటుంబంలోని ముగ్గురు పిల్లలకు 5వ తరగతి వరకు తన పాఠశాలలో ఉచిత విద్య అందిస్తానని ప్రకటించడం అభినందనీయమని తెలిపారు.ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు పిల్లల భవిష్యత్తుకు విద్యా భరోసా కల్పించడం ఎంతో గొప్ప మానవతా కార్యక్రమమని ఆయన కొనియాడారు.మేస్త్రి అందె యాకయ్య, బోదాసు నర్సయ్య, జిలుకర అశోక్ పాల్గొన్నారు.

# చల్లా గురుస్వామికి ఘన నివాళులు

## • సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం



**తొలి అక్షరం/కొణిజర్ల సెప్టెంబర్ 27:** గద్దలగూడెం సీపీఎం సీనియర్ నాయకులు చల్లా గురుస్వామి దశదిన కార్యక్రమానికి సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం హాజరై, స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ సీపీఎం పార్టీ అభివృద్ధికి చల్లా గురుస్వామి కుటుంబం ఎన్నో విధాలుగా తోడ్పాటును అందించిందని గుర్తు చేశారు. సీపీఎం విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గురుస్వామి ముందుండి పనిచేశారని తెలిపారు. పేదలకు పోడు భూములపై హక్కులు కల్పించాలని జరిగిన ఉద్యమాల్లో పాల్గొని, ప్రజలను సమీకరించి పోరాటాల్లో కీలకపాత్ర పోషించారని అన్నారు.ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా చల్లా గురుస్వామి కుటుంబం ఎర్రజెండా పట్ల అచంచల విశ్వాసంతో కొనసాగిందని భూక్యా వీరభద్రం పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు తేజావత్ సీతారాములు, గద్దలగూడెం మాజీ సర్పంచ్ పుల్లూరి వెంకటేశ్వర్లు, చల్లా రాములు, చల్లా వెంకటనారాయణ, సీపీఎం సత్తుపల్లి డివిజన్ నాయకులు తమ్మిశెట్టి శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బంధువులు తమ్మిశెట్టి వేలాద్రి, చల్లా నాగులు, కుటుంబ సభ్యులు చల్లా వెంకన్న, భూలక్ష్మి తదితర బంధుమిత్రులు గ్రామస్తులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# దేశ అభివృద్ధి భావనలను పంచుతూ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి

**- నెక్కొండ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు నాయిని అనుష -అశోక్ పటేల్.**



**తొలి అక్షరం/నెక్కొండ సెప్టెంబర్ 27:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న సెంటర్ లో ప్రధాని నరేంద్ర మోదీ మను కి బాత్ ప్రోగ్రామ్ ను లైవ్ లో ఏర్పాటు చేసి దేశ ప్రజల కోసం చేసే అభివృద్ధి కార్యక్రమాల గురించి, భవిష్యత్తులో నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాల్గొన్న బీజేపీ కార్యకర్త అంబాల సుధీర్ కుమార్ అడ్వకేట్, బీజేపీ మండల అధ్యక్షుడు నాయిని అనుష అశోక్ పటేల్, బీజేపీ జిల్లా నాయకులు అంబాల రాంగోపాల్, మరియు బీజేపీ మండల ఉపాధ్యక్షులు దామచర్ల రామారావు, బీజేపీ మండల నాయకులు ఉల్లెంగుల రాజు , సూత్రపు శ్రీనివాస్ , భారతం రాజు , బొల్లా శ్రీనివాస్ , కక్కర్ల అనిల్ కుమార్, కొయ్యడా అనిల్ కుమార్ మరియు బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షలు మనకెందుకు?

నిన్న ఒక జెండా పట్టిన చేయి,
నేడు మరో జెండా పట్టిందని
ఆ మనిషి మారిపోయాడని కాదు,
అతని నిర్ణయం మారిందంతే!
రాజకీయాల్లో మార్పు సహజం,
నాయకుల ప్రయాణంలో మలుపులు సహజం
కానీ ఆ మార్పును చూసి
కక్షలతో మాటలు విసరడం మాత్రం
మన సంస్కృతి కాదు!
జెండాలు వేరైనా
మన ఊరు ఒక్కటే,
పార్టీలు వేరైనా
మనుషులంతా మనవాళ్లే!
నిన్న కలిసి నడిచిన వారిని
ఈరోజు శత్రువులుగా చూడకు
రాజకీయ అభిప్రాయం మారిందని
మనిషిపై ద్వేషం పెంచకు!
ప్రజల కోసం రాజకీయాలు ఉండాలి,
ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి కాదు
గెలుపు కోసం పోటీ ఉండాలి,
గుండెల్లో కక్షలు ఉండకూడదు!
జెండా మారితే అభిప్రాయం మారొచ్చు
కానీ మనిషి మీద గౌరవం మారకూడదు.
పార్టీలు మారొచ్చు
కానీ మన ఊరి బంధాలు మారకూడదు!
ఇదే ప్రజాస్వామ్యం
ఇదే మన ఊరి గొప్పతనం

**– బూర రజనీకాంత్ తెలంగాణ ఉద్యమ నాయకులు**



# పెద్దవంగర మండల పద్మశాలి సంఘ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారి111వ జయంతి వేడుకలు

**- చిత్రపటానికి పూలమాల వేసి నివార్ల అర్పించిన డాక్టర్ కూరపాటి రమేష్. రాధిక**



**పెద్దవంగర సెప్టెంబర్ 27 (తొలి అక్షరం):** మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివార్లు అర్పించిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఇంటిలెక్సవల్ ఫోరమ్ కన్వీనర్ డాక్టర్ కూరపాటి రమేష్. ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ ఇంటిలేక్స్వల్ ఫోరమ్ కోఆర్డినేటర్ డాక్టర్ కూరపాటి రాధిక. మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ గారికి ఘన నివాలులు అర్పించి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొని యాడినారు స్వాతంత్ర సమరయోధుడు తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమకారుడు గా నీలిచి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీలంతా సంఘటితమై బీసీల హక్కులను వినియోగించుకోవాలని బీసీ ఒక్కతాటి పైకి రావాలని బీసీల ఐక్యత వర్ధిల్లాలని తెలియజేసినారు ఈ కార్యక్రమం లొ మహబూబాబాద్ జిల్లా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోఆర్డినేటర్ ఎదునూరి శ్రీనివాస్. మండలం పద్మశాలి సంఘ అధ్యక్షులు రాపోలు శ్రీనివాస్. గౌరవ అధ్యక్షులు గుల్లపల్లి సదానందం. పద్మశాలి సంఘం నాయకులు వేముల రాజు. గుడ్ల రమేష్. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుమ్మరి రామ్మూర్తి.పానుగోత్ బాలాజీ.వెంకట్ నారాయణ యాదవ్.రాష్ట్ర కోఆర్డినేటర్ కొంగ వీరస్వామి. తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు ప్రాణాలతో చాలగాటమా..?

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కుమార్**

**తొలి అక్షరం/తొండూరు సెప్టెంబర్ 27:**-తొండూరు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యా ర్థినిలు అస్వస్థతకు గురైన ఘటన ఆందోళనకు దారి తీసిందని పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలియజేశారు. పులివెందులలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆయన తన ఏఐఎస్ఎఫ్ నాయకులతొ నిరసన కార్యక్రమం నిర్వహించి ఘటనకు కారణాలను పూర్తిస్థాయిలో విచారించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలనివారు ప్రకటనలో తెలియజేశారుపాఠశాలలో ఆహారం,తాగునీరు,వాష్‌రూమ్‌ల పరిశుభ్రత తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు దినేష్ కుమార్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు




# ఘనంగా క్రీస్తు జన్మదిన వేడుకలు






**తొలి అక్షరం/కొనిజర్ల సెప్టెంబర్ 27:** కొనిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలోని జీవము గల దేవుని సంఘం ఆలయంలో క్రీస్తు జన్మదిన పండుగ మహోత్సవాన్ని ప్రత్యేక ప్రార్థనలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక పాస్టర్ ఎల్డర్ కె. యేసురత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అపోస్తులు ఎం. యెహోషువ ముఖ్య వాక్యోపదేశకులుగా పాల్గొని క్రీస్తు జననం, ప్రేమ, శాంతి, సోదరభావం గురించి ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు.సంఘ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంఘ పెద్దలు ఏసు శాంత కుమార్, సామేల్, నాగేశ్వరరావు, సుందరం, సన్నీ తదితరులు పాల్గొన్నారు. సంఘ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నెలపట్ల గ్రామంలో ఘనంగా 5కే రన్




**తొలి అక్షరం/చౌటుప్పల్ సెప్టెంబర్ 27:** చౌటుప్పల్ మండలం నెలపట్ల గ్రామంలో దబ్బటి రాములు గౌడ్ గారి ఆధ్వర్యంలో 5కే రన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెలపట్ల గ్రామంతో పాటు పలు గ్రామాల నుంచి యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దబ్బటి రాములు గౌడ్ గారు మాట్లాడుతూ యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఇలాంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. యువత ముందుండి మరిన్ని ఆరోగ్య, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలపట్ల సర్పంచ్ వసంత నాగేశ్ గౌడ్ గారు, మాజీ ఎంపీటీసీ కడగ మోహన్ గారు, ఉప సర్పంచ్ చిన్నం బాలరాజ్ గారు, దబ్బడి ఉపేందర్ గారు, వార్డు సభ్యులు గంజి లింగేశ్ గారు, సప్పటి సంజీవరెడ్డి గారు, గుర్రం ప్రమోద్ గారు, చౌటా శివ గారు, బుట్టి కృష్ణ గారు, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు అబ్బుతి అంజనేయులు గౌడ్ గారు, ఖత్తుల సాయి గారు, బోన్తి లింగస్వామి గారు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వోనస్ హాస్పిటల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించి పాల్గొన్న వారికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌ను కూడా ఏర్పాటు చేసినందుకు వోనస్ హాస్పిటల్ యాజమాన్యానికి నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి సహకరించిన చౌటుపల్లి పోలీసు మిత్రులకు కూడా నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యువత ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, అందుకే ఇలాంటి ఆరోగ్యకర మైన కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ప్రతి ఒక్కరూ పాల్గొనాలని దబ్బటి రాములు గౌడ్ గారు తెలిపారు.

# 18 ఏళ్లుగా నిరుద్యోగ యువతకు 'ఆసరా'.. బొల్ల శివశంకర్ సేవా ప్రస్థానం





**63 కంపెనీలు.. సుమారు వెయ్యి మంది నిరుద్యోగులు.. 300 మందికి జాయినింగ్ సర్టిఫికెట్లు**

**ఒకే వేదికపై భారీ ఉద్యోగ మేళా.. యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ఆసరా ఫౌండేషన్ ముందడుగు**




**తొలి అక్షరం/చౌటుప్పల్:సెప్టెంబర్ 27:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా గత 18 సంవత్సరాలుగా ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఫౌండేషన్ చైర్మన్ బొల్ల శివశంకర్ తెలిపారు. యువతకు ఉద్యోగం కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన లభించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 63 ప్రముఖ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాయి. ఉద్యోగాల కోసం సుమారు 1,000 మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు హాజరై వివిధ కంపెనీల ప్రతినిధులకు ఇంటర్వ్యూలు ఎదుర్కొన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలు, ప్రతిభ ఆధారంగా కంపెనీల ప్రతినిధులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియలో సుమారు 300 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక కాగా, వారికి కార్యక్రమంలోనే జాయినింగ్ సర్టిఫికెట్లు అందజేశారు.

**ఒకే వేదికపై 63 కంపెనీలు.. వెయ్యి మందికి పైగా యువత** వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నిరుద్యోగ యువత ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని తమకు ఆసక్తి ఉన్న కంపెనీలలో ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఒకే వేదికపై సుమారు 63 కంపెనీలు అందుబాటులో ఉండటంతో యువతకు అనేక ఉద్యోగ అవకాశాలను ఒకేసారి పరిశీలించే అవకాశం లభించింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్, ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. **18 ఏళ్లుగా యువతకు అండగా ఆసరా** ఈ సందర్భంగా ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్ల శివశంకర్ మాట్లాడుతూ.. ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో ఆసరా ఫౌండేషన్‌ను స్థాపించామని తెలిపారు. గత 18 సంవత్సరాలుగా నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళాలు నిర్వహిస్తూ ఉద్యోగ అవకాశాలను చేరువ చేస్తున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా యువతకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరికీ సరైన అవకాశాన్ని అందించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ జాబ్‌మేళాలో సుమారు వెయ్యి మంది యువత పాల్గొనడం, 63 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించడం, సుమారు 300 మందికి జాయినింగ్ సర్టిఫికెట్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. యువత తమకు లభిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఉద్యోగంలో చేరిన తర్వాత కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని బొల్ల శివశంకర్ సూచించారు. **300 కుటుంబాలకు ఉద్యోగ భరోసా** జాబ్‌మేళాలో ఎంపికైన సుమారు 300 మంది యువతకు జాయినింగ్ సర్టిఫికెట్లు అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉద్యోగం పొందిన యువతలో కొత్త ఉత్సాహం కనిపించింది. తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు యువత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్ల కవిత, ఫౌండేషన్ ప్రతినిధులు విజయ్, రాఘవ, సమ్మత్, భాస్కర్, మురళి, అబ్బాస్, రాజశేఖర్, రమేష్, ఉత్తరయ్య, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు, ఉద్యోగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి మృతికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంతాపం



మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన



మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**తొలి అక్షరం/చౌటుప్పల్. సెప్టెంబర్ 27:** మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ మాతృమూర్తి మృతి పట్ల మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మాతృమూర్తి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పబ్బు రాజు గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తల్లిని కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయమని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# త్యాగమే ఊపిరిగా.. బాపూజీ జీవితం

**- బాపూజీ ఆశయాలు యువతకు మార్గదర్శకం**



**తొలి అక్షరం/ఖమ్మం సెప్టెంబరు 27:** తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల హక్కుల కోసం బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజాసేవకు ప్రాధాన్యత ఇచ్చిన ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం, బిచ్చాల తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, కసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో ఘనంగా పౌర్ణమి యజ్ఞం..




**తొలి అక్షరం/కరీంనగర్,సెప్టెంబరు 27:** శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో భాద్రపద పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించగా, బ్రాహ్మణులు అభిషేక్ ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్ తదితరులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి యజ్ఞం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరియు ధార్మిక చింతన పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలిపారు. విద్యతో పాటు సంస్కారం, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, గట్టు రాంప్రసాద్, నడిపెల్లి దీన్ దయాల్ రావు, అప్పిడి వకుళాదేవి, ఎలగందుల సత్యనారాయణ, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు ఆచార్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బాపూజీకి భారతరత్న ప్రకటించాలి: పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య



**తొలి అక్షరం/గోపాల్‌రావుపేట, సెప్టెంబరు 27:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొలిపాక మల్లయ్య, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అలువాల విష్ణు డిమాండ్ చేశారు. బాపూజీ జయంతి సందర్భంగా ఆదివారం గోపాల్‌రావుపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు చేనేత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాపూజీ విశేష కృషి చేశారని అన్నారు. ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనతో కార్యకర్తల్లో జోష్.. ఇక కాస్కో కేటీఆర్!

**- రూ.60 కోట్లతో నూతన కలెక్టరేట్ ప్రారంభం**




**తొలి అక్షరం/కరీంనగర్, సెప్టెంబరు 27:** సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో కరీంనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజల్లో కొత్త ఉత్సాహం వస్తుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రూ.60 కోట్లతో నిర్మించిన నూతన కలెక్టరేట్ భవనాన్ని సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. సుడా నిధులతో రహదారి, హెలిప్యాడ్, గార్డెన్లు, సింథటిక్ వాకింగ్ ట్రాక్ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. బీజేపీ నేతల తీరుపై విమర్శలు చేసిన ఆయన.. కేబుల్ బ్రిడ్జి లైటింగ్, ఆర్వోబీ పనుల జాప్యంపై పలు ఆరోపణలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారని వ్యాఖ్యానిస్తూ.. "ఇన్నిరోజులు ఒక లెక్క.. ఇప్పుడొక లెక్క.. ఇక కాస్కో కేటీఆర్" అంటూ సవాల్ విసిరారు.

## ఐపీఎల్ ఫ్యాన్స్ కు బిగ్ సర్ప్రైజ్.. చెన్నై సూపర్ కింగ్స్ కొత్త హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఞూా) చరిత్రలో భారీ పాపులారిటీ ఉన్న జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) మేనేజ్‌మెంట్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ 2027 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, భారత మాజీ పేస్ దిగ్గజం జహీర్ ఖాన్ (ఖష్ట్రవవతీ ఖష్ట్రుఅ)ను తమ జట్టుకు కొత్త హెడ్ కోచ్(ఏఙుఅ జశ్ఙఎష్ట్ర)గా నియమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత అనేక సంవత్సరాలుగా సీఎస్‌కే జట్టుకు కోచ్‌గా సేవలందించి, జట్టును ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ (ఞవజూష్ట్రవఅ ఖీశ్రీవఎఱఅస్త్ర) స్థానంలో జహీర్ ఖాన్ ఈ బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.దాదాపు 19 సంవత్సరాల పాటు చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో విడదీయరాని బంధాన్ని కొనసాగించిన న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్, ఇటీవల తన పదవికి వీడ్కోలు పలికారు. గత సీజన్లలో జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం, అలాగే ఆయన ఇంగ్లాండ్ పురుషుల టెస్ట్ జట్టుకు హెచ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించడానికి నిర్ణయించుకోవడంతో ఈ మార్పు జరిగిందని తెలుస్తోంది. ఫ్లెమింగ్ లాంటి దిగ్గజ కోచ్ తప్పుకోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన వ్యక్తి కోసం వెతికిన సీఎస్‌కే యాజమాన్యం, అంతర్జాతీయ క్రికెట్‌లో అపార అనుభవమున్న జహీర్ ఖాన్ వైపు మొగ్గు చూపింది.

2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న జహీర్ ఖాన్, గతంలో ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు మెంటార్‌గా, కోచింగ్ సిబ్బందిలో సభ్యుడిగా పనిచేసిన అపార అనుభవం కలిగి ఉన్నారు. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ (మీా ఐష్ట్రశీఅఱ) కెప్టెన్సీలో జహీర్ అంతర్జాతీయ క్రికెట్ ఆడటం వల్ల, ధోనీతో ఆయనకు మంచి సాన్నిహిత్యం ఉంది. ఈ కారణంగానే సీఎస్‌కే జట్టులో జహీర్ నియామకం వెనుక ధోనీ సిఫారసు కూడా ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, సీఎస్‌కే ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో జహీర్ ఖాన్ వ్యూహాలు జట్టును మళ్లీ విజయాల బాట పట్టించడంలో ఎంతవరకు సఫలమవుతాయనేది ఆసక్తికరంగా మారింది.

గత కొన్ని సీజన్లుగా ఆశించిన స్థాయిలో

## హెచ్‌సీఏ మహిళల అండర్-19 టీ20 టోర్నీకి రంగం సిద్ధం



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్మహిళల అండర్- విభాగంలో నిర్వహించనున్న టీ20 సూపర్ లీగ్టోర్నీకి సంబంధించి మొత్తం ఎనిమిది జట్లను మంగళవారం అధికారికంగా వెల్లడించింది. క్రికెట్‌లో అత్యంత పోటీ ఫార్మాట్‌లో వర్ధమాన మహిళా క్రికెటర్ల సత్తా చాటేందుకు ఈ లీగ్ వేదిక కానుంది. యువ క్రీడాకారిణులకు నాణ్యమైన మ్యాచ్ అనుభవం కల్పించడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించే లక్ష్యంతో ఈ జట్లను ఎంపిక చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన అమ్మాయిలకు ఈ జట్లలో చోటు దక్కింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు భవిష్యత్తులో ఉన్నత స్థాయి అవకాశాలు దక్కే వీలుంది.జట్ల వివరాల్లోకి వెళితే, టీమ్ ఏం జట్టుకు కమ్మిలి నిధి) కెప్టెన్, వికెట్ కీపర్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో సి.దీక్షిత, జాజ్మిన్ గిల్, బి.కీర్తన, అక్షర గుండు, కె.అర్పిత, దృవిజ్ఞ, అల్లం సృష్టి, సిమ్రాన్ యాదవ్, శ్రీజ, మిద్దెల లికిల (నల్గొండ), ముదావత్ సింధుజ ఎంపికయ్యారు.టీమ్ బిం బృందానికి జి.కావ్య శ్రీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, నందిగామ అక్షయ, ఆదిమూలం హాసిని, బి.గీతిక ప్రియదర్శిని, వేముల జెనిక్ష, ఆయిషా షేక్, తూము అనన్య, రుక్సార్, ప్రవళిక, తలారి సంసిత, పన్యాల సహస్ర, ప్రణవి సభ్యులుగా ఉన్నారు.టీమ్ సిం జట్టుకు కట్టా తేజస్విని సారథ్యం వహిస్తుండగా, ప్రతీక కంచర్ల, ఎడ్ల దర్శిని, లింగంపల్లి లక్ష్మి సహస్ర, జి.హేష్మిత శ్రీ, సుప్రీత, బుక్య శారద, నక్కా నిధి కృష్ణ, మేఘన గౌడ్, పట్టిక షాన్వి, సామల చిద్విలాసిని, అంకెనగారి సుచరిత స్థానం సంపాదించారు.టీమ్ డిం జట్టుకు ఎం.శ్రీ గ్రంధ నాయకత్వం వహిస్తున్నారు. ఇందులో ఆర్.లలిత, సజ్జా నాగ శ్రీ చరిత, ఎన్.నీతా శాశ్వత, ప్రతీక, టి.జాహ్నవి, పి.తనుషిక, కె.సహస్ర, ఝాన్సీ, లకవత్ చైతన్య, కన్నం శ్రేయ, సోనాలి ఆడనున్నారు.టీమ్ ఈం జట్టు పగ్గాలను ఎం.చార్వి లక్ష్మి శ్రీ అందుకోగా, వై.ఈశ్వరి, ఎం.అక్షిత గౌడ్, సాయి తనుశ్రీ, స్వాగతిక పాండ, సి.నాగ రూపిణి, పోలమ శ్రీవాస్తవ, పెవల్ తనీష, ముత్యాల అనిక, వానరాసి ప్రసన్న, సి.జయ కాత్యాయని, బుచ్చి హాసిని ఉన్నారు.మిగిలిన జట్లలో టీమ్ ఎఫ్ం జట్టుకు ఎన్.బబిత ఫ్టెన్‌గా ఉండనున్నారు. సి.నాగసాయి అక్షిత, బొక్క దీప్షిక, డి.అనన్య, టి.హర్షిణి, పూర్క రిషిమ, డి.నిష్ట, ధరావత్ రిషిక, ఇ.గౌతమి, పూర్వ లాహోటి, నవురు సంజన, ఎ.జుచితా రెడ్డి జట్టులో చోటు దక్కించుకున్నారు.టీమ్ జిం బృందాన్ని ప్రతీక్ష వెంకటేషనడిపించనుండగా, శరగూడం మిత్ర, పి.బంధన, హీరల్ జోషి, ధరావత్ శ్రావణి, యమున, అక్కీ ఆశ్రిత, ఆస్థా శర్మ, సముద్రాల ఇనాయ, శ్రీ సహస్ర రాజ్, డి.ప్రణవి, ఉదయ చంద్రిక బరిలోకి దిగుతారు.ఇక టీమ్ హెచ్ం జట్టుకు పి.అక్షయ రెడ్డి ( సారథిగా వ్యవహరించనున్నారు. ప్రాచీ యాదవ్, వి.నికేషిణి, ఎల్.శ్రుతిక, కె.అనేరా శాంత్, స్రవంతి, నిత్యశ్రీ, నెల్లుట్ల అక్షయ, కొడిగంటి మనీషా, డివిఎన్‌ఎం శ్రీ రెణ్య, పప్పు కీర్తన, హరిణి ఈ జట్టుకు ఎంపికయ్యారు. ఈ యువ ప్లేయర్లు తమ ప్రతిభతో లీగ్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

## వెండీస్‌తో తొలి వన్డే.. బ్రేక్ కానున్న 3 భారీ రికార్డులు..




భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక వన్డే సిరీస్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 27 నుంచి ప్రారంభం కానున్న ఈ సిరీస్ ద్వారా భారత్‌లో హోమ్ సీజన్ కూడా మొదలుకానుంది. ఈ నేపథ్యంలో వెస్టిండీస్ సీనియర్ ఆల్ రౌండర్ జెసన్ హోల్డర్ ప్రముఖ మీడియాతో మాట్లాడుతూ భారత జట్టుపై, ముఖ్యంగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, యువ కెప్టెన్ శు భమన్ గిల్ గురించి తన మనసులోని మాటలను పంచుకున్నారు. ప్రపంచ క్రికెట్‌లో ఈ దిగ్గజాల పాత్ర ఎంత కీలకమో ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

శుభమన్ గిల్ కెప్టెన్సీపై హోల్డర్ ప్రశంసలు

ఐపీఎల్‌లో శుభమన్ గిల్ కెప్టెన్సీలో ఆడిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ జెసన్ హోల్డర్ తన నాయకత్వ లక్షణాలను కొనియాడారు. గిల్ చాలా ప్రశాంతంగా ఉంటాడని, ఎక్కడా ఆందోళన చెందకుండా స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తాడని తెలిపారు. మైదానంలో బౌలర్లకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ, వారిని నమ్ముకుని ఫీల్డ్ సెట్ చేసుకునే అవకాశమిస్తాడని హోల్డర్ వెల్లడించారు. గిల్ ఇంకా యువ కెప్టెన్ అయినప్పటికీ, మ్యాచ్‌లు ఆడుతూ ఎంతో వేగంగా నేర్చుకుంటున్నాడని, భవిష్యత్తులో అతను మరింత గొప్ప నాయకుడిగా ఎదుగుతాడని ప్రశంసించారు.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలపై ఏమన్నారంటే

భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల గురించి మాట్లాడుతూ జెసన్ హోల్డర్ ఆసక్తికరమైన కామెంట్లు చేశారు. విరాట్ కోహ్లీ బహుశా వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ అని, అతన్ని మైదానంలో చూడటమే ఒక అద్భుతమని కొనియాడారు. అలాగే రోహిత్ శర్మకు కూడా వన్డేల్లో అద్భుతమైన రికార్డు ఉందని, ముఖ్యంగా వెస్టిండీస్ జట్టుపై అతను ఎప్పుడూ అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాడని గుర్తుచేశారు. ఈ ఇద్దరు లెజెండ్స్‌తో తలపడటం ఏ బౌలర్‌కైనా సవాల్‌తో కూడుకున్న విషయమేనని, అలాంటి ప్రపంచ స్థాయి ఆటగాళ్లతో పోటీ పడటాన్ని తాను ఎప్పుడూ ఆస్వాదిస్తానని హోల్డర్ చెప్పారు.గుర్నూర్ బ్రార్ పై ప్రశంసలుఇదే ఇంటర్వ్యూలో గుజరాత్ టైటాన్స్ జట్టులో తాను దగ్గరగా చూసిన యువ పేసర్ గుర్నూర్ బ్రార్ ప్రతిభను హోల్డర్ ఎంతగానో మెచ్చుకున్నారు. బ్రార్ వద్ద అద్భుతమైన వేగంతో పాటు మంచి బౌన్సీ డెలివరీలు ఇచ్చే ఎత్తు ఉందని, అతనికి భవిష్యత్తులో గొప్ప కెరీర్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక రాబోయే వన్డే సిరీస్ ఇటు వెస్టిండీస్ జట్టుకు, అటు టీమిండియాకు ఎంతో కీలకమని, ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లు హోరాహోరీ పోరు సాగుతుందని ఆయన అంచనా వేశారు.

## హోమ్ లోన్ Vs ప్రాపర్టీ లోన్.. మీకు ఏది బెస్ట్..? ఈ చిన్న తప్పులతో జేబుకు చిల్లే..!




మనిషి జీవితంలో ఆర్థిక భద్రతను నిర్మించుకోవడంలో స్థిరాస్తుల కొనుగోలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుంది. సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడానికో లేదా ఇప్పటికే ఉన్న ఆస్తుల విలువ ఆధారంగా తక్షణ అవసరాలకు డబ్బుల కోసం బ్యాంకులు ప్రధానంగా రెండు రకాల లోన్ సౌకర్యాలను అందిస్తున్నాయి. అవే హోమ్ లోన్, ప్రాపర్టీ లోన్. ఈ రెండింటి నిబంధనలు పూర్తిగా వేర్వేరు కాబట్టి మీ ప్రస్తుత అవసరానికి తగినదాన్ని ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. హోమ్ లోన్ అనేది కొత్తగా ఒక ఇంటిని, ఫ్లాట్‌ను కొనడానికి లేదా సొంత స్థలంలో నూతన ఇల్లు నిర్మించుకోవడానికి మాత్రమే బ్యాంకులు మంజూరు చేసే లోన్. దీనిని పొందడానికి దరఖాస్తుదారుడికి మెరుగైన క్రెడిట్ స్కోర్‌తో పాటు లోన్ సకాలంలో చెల్లించగల స్థిరమైన ఆదాయం ఉండటం తప్పనిసరి. బ్యాంకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా హోమ్ లోన్లకు వడ్డీ రేట్లు తక్కువగా ఉండటంతో పాటు 20 నుంచి 30 సంవత్సరాల వరకు సుదీర్ఘ కాలవ్యవధిలో రీపేమెంట్ చేసుకునే వెసులుబాటు లభిస్తుంది. మరోవైపు ఆస్తిపై లోన్ అనేది ఇప్పటికే మీ పేరిట ఉన్న నివాస లేదా వాణిజ్య స్థలాన్ని బ్యాంకు వద్ద తాకట్టు పెట్టి నగదు పొందే పద్ధతి. ఇందులో వచ్చే నిధులను ఇంటి నిర్మాణానికే కాకుండా వ్యాపార విస్తరణ, ఉన్నత చదువులు, వివాహ ఖర్చులు లేదా అత్యవసర వైద్య ఖర్చుల వంటి ఏ అవసరానికైనా ఎటువంటి ఆంక్షలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ లోన్‌లో మీ ఆస్తి మార్కెట్ విలువను బట్టి మాత్రమే డబ్బులు వస్తాయి. ఉదాహరణకు మీ ఆస్తి విలువ రూ.1 కోటి ఉంటే బ్యాంకు రూల్స్ ప్రకారం రూ.

50 లక్షల నుండి రూ. 70 లక్షల వరకే లోన్ లభిస్తుంది తప్ప పూర్తి కోటి రూపాయలు ఇవ్వరు.

ఈ రెండింటిలో ఏది మీకు సరైనదో తేల్చుకోవడానికి మీ అవసరమే గీటురాయి. మీరు కొత్తగా ఇంటిని తీసుకోవడం లేదా సొంత స్థలంలో కట్టుకోవాలనుకుంటే తక్కువ వడ్డీకే లభించే హోమ్ లోన్ బెస్ట్ ఆప్షన్. అలా కాకుండా ఇప్పటికే మీ వద్ద ఉన్న ఫ్లాట్ లేదా ఖాళీ స్థలాన్ని ఉపయోగించి కొత్త వ్యాపారం ప్రారంభించాలన్నా, లేదా పెద్ద మొత్తంలో డబ్బు అవసరమైనా దాన్నిపై లోన్ తీసుకోవడం సరైన అవుతుంది.

## ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ డేట్స్ వచ్చేశాయ్.. డిస్కౌంట్లు చూస్తే నోరెళ్లాబెట్టాల్సిందే..




ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ డేట్స్ వచ్చేశాయి. ఈ మెగా సేల్ అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్నట్లు ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్ తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక మైక్రోసైట్‌ను లైవ్ చేస్తూ, బ్యాంక్ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్ల వివరాలను వెల్లడించింది. సాధారణ యూజర్ల కంటే ఒక రోజు ముందుగానే ప్లస్ మెంబర్స్‌కు ఈ సేల్ అందుబాటులోకి రానుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ , ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులు, ఫ్లిప్‌కార్ట్ క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు ఈ 24 గంటల ఎర్లీ యాక్సెస్ లభిస్తుంది. ప్రధాన సేల్ ప్రారంభం కాకముందే పరిమిత స్టాక్ ఉండే హాట్ డీల్స్‌ను దక్కించుకునే అవకాశం వీరికి దక్కుతుంది.బ్యాంక్ ఆఫర్లు -- క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు మైక్రోసైట్‌లో పొందుపరిచిన సమాచారం ప్రకారం కస్టమర్లకు భారీ ఆర్థిక రాయితీలు లభించనున్నాయి.తక్షణ డిస్కౌంట్: యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులను ఉపయోగించి చేసే కొనుగోళ్లపై గరిష్టంగా 10శాతం తక్షణ తగ్గింపు లభిస్తుందిఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్: ఈ కార్డు వినియోగదారులు అదనంగా 10 శాతం వరకు పొదుపు చేయవచ్చు.సూపర్ మనీ : మొదటి లావాదేవీపై 10శాతం క్యాష్‌బ్యాక్ అందించనున్నారు.యూపీఐ, ఇతర ప్రముఖ పేమెంట్ గేట్‌వేల ద్వారా చెల్లింపులు జరిపే వారికి సైతం ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు ఉంటాయని సంస్థ తెలిపింది.ఏయే భాగాల్లో భారీ తగ్గింపులు?నిర్దిష్ట ఉత్పత్తుల వారీగా ఇంకా ధరలను అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లైయన్స్‌పై భారీ తగ్గింపులు ఉండనున్నట్లు స్పష్టమైంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పీసీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఆడియో డివైజ్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ హోమ్ అప్లయన్సెస్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్స్ ఉండనున్నాయి.ఐఫోన్, శాంసంగ్ డీల్‌కొత్త మొబైల్ కొనాలనుకునే వారికి బిగ్ బిలియన్ డేస్ సేల్ అత్యుత్తమ వేదిక కానుంది.ఆపిల్ ఐఫోన్లు: ఇటీవల ఆపిల్ కొత్త ఐఫోన్ 18 ప్రో సిరీస్‌ను ఆవిష్కరించిన నేపథ్యంలో మునుపటి మోడళ్లయిన ఐఫోన్ 16, ఐఫోన్ 17 సిరీస్‌లపై అదిరిపోయే ప్రైస్ కట్స్ వచ్చే అవకాశం ఉంది.శాంసంగ్ గెలాక్సీ: శాంసంగ్ ప్రీమియం ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్26 సిరీస్‌పై కూడా ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ధరల తగ్గింపు ఉండవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా మెమరీ చిప్‌ల కొరత నెలకొన్నందున కొన్ని ఫోన్ల లభ్యత, తుది ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది.సేల్ ప్రారంభ సమయం దగ్గరపడే కొద్దీ నిర్దిష్ట ప్రోడక్ట్ డీల్స్‌ను ఫ్లిప్‌కార్ట్ ఒక్కొక్కటిగా రివీల్ చేయనుంది. పండుగ సీజన్ షాపింగ్ కోసం వినియోగదారులు ఇప్పటి నుంచే తమ విష్‌లిస్ట్‌లను సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## పడిపోతున్న బంగారం, వెండి ధరలు.. రెండు రోజుల్లో ఎంత తగ్గిందంటే..



బంగారం కొనేందుకు సిద్ధమవుతున్న వారికి శుభవార్త. ఇటీవల గోల్డ్ రేటు ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. ఈ క్రమంలో శని, శుక్రవారాల్లోనూ ధర భారీగా పెరిగింది. అయితే, ఇవాళ మాత్రం గోల్డ్ రేటు కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే గత రెండు రోజుల్లో సుమారు వెయ్యి రూపాయల వరకు దిగి వచ్చింది.ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉన్నాయి. అయితే, బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీపావళి నాటికి బంగారం గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి, 10 గ్రాములకు రూ.1.80 లక్షలను దాటవచ్చని కూడా వారు పేర్కొంటున్నారు.తాజాగా మంగళవారం (సెప్టెంబర్ 22) దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. అయితే ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. ప్రధాన నగరాల్లో ధరల వివరాలు.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర వద్ద కొనసాగుతోంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,720 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,840 వద్ద కొనసాగుతోంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,54,570 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,690 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. ప్రస్తుతం కిలో గ్రాము వెండి ధర రూ.2,49,900 వద్ద ట్రేడవుతోంది.

## కెరీర్ పీక్‌లో ఉండగానే ప్రమాదం.. ఎనిమిది నెలలపాటు మంచానికే పరిమితం



తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవసరం లేని కథానాయికల్లో స్నేహ

ఒకరు. సహజమైన అందం, చక్కటి అభినయం, కుటుంబ కథా చిత్రాల్లో ఒదిగిపోయే నటనతో ఆమె తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో మంచి పేరు సంపాదించారు. స్నేహ అసలు పేరు సుహాసిని. తమిళ సినిమాలతో కెరీర్ ప్రారంభించిన ఆమె.. తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారధి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.గోపీచంద్ హీరోగా తెరకెక్కిన తొలివలపు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన స్నేహ.. ఆ తర్వాత 'ప్రియమైన నీకు' సినిమాతో మరింత దగ్గరయ్యారు. ఆ సినిమా విజయం ఆమె కెరీర్‌కు మంచి ఊపునిచ్చింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడకుండా వరుస సినిమాల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. హనుమాన్ జంక్షన్, వెంకీ, సంక్రాంతి, రాధాగోపాళం, శ్రీరామదాసు, మహారధి, మధుమాసం, ఏవండోయ్ శ్రీవారు, పాండురంగడు వంటి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకున్నారు.ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకుల్లో స్నేహకు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. అయితే స్నేహ కెరీర్‌లో జరిగిన ఓ సంఘటన ఆమెను కుంగదీసిందట. కెరీర్ మంచి స్థాయిలో

## ప్యారడైజ్ సినిమా చూసిన కేటీఆర్.. కేసీఆర్ పాత్ర గురించి ఏమన్నారంటే



హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది పారడైజ్' సినిమాను పార్టీ సభ్యులతో కలిసి వీక్షించారు కేటీఆర్ . చాలా ఏళ్ల తర్వాత థియేటర్‌లో సినిమా చూశానని ఎక్స్‌లో వెల్లడించారు. సినిమా చాలా బాగుందని, దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారని, నాని నటన ఆకట్టుకుందని కేటీఆర్ ప్రశంసించారు. ఎమ్మెల్యే శంకరన్న పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ఆ పాత్ర స్ఫూర్తి ఏమిటో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కేటీఆర్ రాకతో థియేటర్ వద్ద అభిమానులు, ప్రేక్షకులు భారీగా తరలివచ్చారు. చాలా ఏళ్ల తర్వాత థియేటర్‌లో సినిమా చూసేందుకు వచ్చినట్లు ఎక్స్ ( ట్విట్టర్) ద్వారా వెల్లడించిన కేటీఆర్.నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన "ది పారడైజ్" చిత్రాన్ని చూశారు కేటీఆర్. తనకు ఇష్టమైన నటుడు నాని సినిమాను చూసేందుకు శనివారం రాత్రి థియేటర్‌కు వెళ్లారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. సినిమాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హావభావాలు, స్టైలింగ్‌ను పోలి ఉండే "శంకరన్న" (ప్రియదర్శి) పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేటీఆర్ రాకతో థియేటర్ ఆవరణకు భారీగా ప్రేక్షకులు, అభిమానులు చేరుకున్నారు. .సినిమా చూసిన తర్వాత కేటీఆర్ మాట్లాడుతూ.. ది పారడైజ్ సినిమా చాలా బాగుంది. సామాజిక అంశాన్ని బలంగా తెరపై ఆవిష్కరించారు. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. కథ, పాత్రలు, సన్నివేశాలను ప్రభావవంతంగా చూపించారు. నాని అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. పాత్రకు పూర్తిగా న్యాయం చేశారని కేటీఆర్ అన్నారు. అలాగే మీఆ శంకరన్న పాత్ర ప్రత్యేక ఆకర్షణ, ఆ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. సినిమాలోని సామాజిక అంశాలు, పాత్రల సంఘర్షణ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయని అన్నారు కేటీఆర్. అభినందించారు.

## ఆ కండిషన్‌తోనే బిగ్ బాస్ కు వెళ్ళా.. ఒక్క రూపాయి కూడా రాలేదు.



బాలీవుడ్‌లో తన డాన్స్, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నోరా ఫతేహి.. ప్రస్తుతం భారతీయ సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు. కెనడాకు చెందిన ఈ ముద్దుగుమ్మ డాన్స్ పెర్ఫార్మెన్స్‌తో పాటు మ్యూజిక్ ఆల్బమ్స్, సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా భారీ క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే నేడు స్టార్‌గా కొనసాగుతున్న నోరా ప్రయాణం అంత సులభంగా సాగలేదు. కెరీర్ ప్రారంభంలో ఆర్థిక ఇబ్బందులు, అవకాశాల కోసం ఎదురుచూపులు, పారితోషికం చెల్లింపుల విషయంలో ఎదురైన సమస్యలను ఆమె స్వయంగా వెల్లడించారు.

ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నోరా ఫతేహి తన కెరీర్ ప్రారంభ దశకు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కొన్ని ప్రాజెక్టులు, పాటల్లో పనిచేసినప్పటికీ తనకు రావాల్సిన పారితోషికం పూర్తిగా అందలేదని ఆమె తెలిపారు. తాను పనిచేసిన ప్రాజెక్టులకు సంబంధించిన చెల్లింపులు ఏజెన్సీలకు చేశామని కొందరు నిర్మాతలు చెప్పేవారని, అయితే చివరకు తన చేతికి మాత్రం డబ్బులు వచ్చేవి కావని నోరా పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే ఆమెకు 'బిగ్ బాస్' నుంచి అవకాశం వచ్చిందని చెప్పారు.తొలినాళ్లలో రియాలిటీ షోలపై తనకు పెద్దగా ఆసక్తి ఉండేది కాదని నోరా వెల్లడించారు. అందుకే బిగ్ బాస్ నిర్వాహకులు సంప్రదించినప్పుడు మొదట తాను ఆ ఆఫర్‌ను తిరస్కరించానని చెప్పారు. అయితే షో ద్వారా లభించే పారితోషికం గురించి తెలుసుకున్న తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు నోరా తెలిపారు. అదే సమయంలో బిగ్ బాస్ వంటి భారీ





## బిగ్‌బాస్ 10 మూడో వారం ఎలిమినేషన్ ఊహించని కంటెస్టెంట్ బయటకు నిరాశలో ఫ్యాన్స్

బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 ఆసక్తికరంగా, రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే ఈ సీజన్ లో విజయవంతంగా రెండు వారాలు పూర్తయ్యాయి. ఇప్పుడు మూడో వారం కూడా ఎండింగ్ కు వచ్చేసింది. దీంతో ఎప్పటిలాగే ఎలిమినేషన్ ఎవరన్నది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే వీకెండ్ ఎపిసోడ్స్ లో భాగంగా నాగార్జున ఎంట్రీ ఇచ్చి కంటెస్టెంట్లతో మాట్లాడుతున్నారు. తప్పులు చేసిన వారితో తనదైన శైలిలో ఆడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మూడో వారం ఎవరు బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకు చాలా మంది ఓటింగ్ లో అట్టడుగున ఉన్న యాంకర్ వర్షిణీ హౌస్ నుంచి బయటకు వస్తుందనుకుంటున్నారు. అయితే ఇక్కడే ఓ ట్విస్ట్ ఇచ్చాడు బిగ్ బాస్. ఎవరూ ఊహించని విధంగా ఓ టాప్ మేల్ కంటెస్టెంట్ బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అయ్యి బయటకు రానున్నాడని సమాచారం. మూడో వారం ఎలిమినేషన్స్ కు సంబంధించి బిగ్ బాస్ 10 నామినేషన్స్ లో త్రిగుణ్, సుధీర్ రెడ్డి, అమన్, చరణ్, వంశీ, షాలిని, వర్షిణి, సింగర్ ఝాన్సీ ఉన్నారు. ప్రస్తుతమున్న ఓటింగ్ ట్రెండస్ ప్రకారం త్రిగుణ్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ఎవరూ ఊహించని విధంగా గత రెండు వారాలు బాటమ్ లో ఉన్న సుధీర్ రెడ్డి ఇప్పుడు ఏకంగా టాప్ 2కి దూసుకొచ్చాడు. ఇక చరణ్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.ఇక టాప్-4 ప్లేస్ లో అమన్ ఉండగా, వంశీ ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆరో ప్లేస్ లో వర్షిణీ ఉండగా, ఏడో ప్లేసులో షాలినీ, ఎనిమిదో స్థానంలో సింగర్ ఝాన్సీ ఉన్నారు. అయితే సింగర్ ఝాన్సీకి సోషల్ మీడియాలోనూ ఫుల్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. పైగా ఆమెకు రైతు బిడ్డ ట్యాగ్ కూడా ఉంది. దీంతో ఆమె ఎలిమినేట్ అయ్యే ఛాన్స్ లేదు. ఇక షాలినీ కూడా గేమ్ బాగా ఆడుతోంది. సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెకు మంచి సపోర్ట్ ఉంటోంది. ఇక మిగిలింది యాంకర్ వర్షిణీ, టెంపర్ వంశీ. ప్రస్తుతం వీరిద్దరి మధ్యనే ఎలిమినేషన్ ప్రాసెస్ జరుగుతోంది.

## నాని 'ది ప్యారడైజ్' సక్సెస్ మీట్.. మరోసారి గొప్ప మనసు చాటుకున్న మోహన్ బాబు



ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 'ది ప్యారడైజ్' సినిమా ఫీవర్ నడుస్తోంది. ఎక్కడ చూసినా ఈ సినిమా పేరే వినిపిస్తోంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో అయితే ఈ మూవీ పేరు తెగ మార్మోగుతుంది. స్వయంగా మాజీ మంత్రి, బీఆర్ ఎస్ అగ్రనేత కేటీఆర్ సైతం ది ప్యారడైజ్ సినిమాను చూసేందుకు థియేటర్ కు వెళు తున్నాననడం ఆసక్తికరంగా మారింది. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ పీరియాడికల్ యాక్షన్ ఎంటర్ టైనర్ లో జడల్ అనే పాత్రలో నాని అదరగొట్టాడు. హీరోయిన్ గా కయాదు లోహర్ అందంగా కనిపించింది. ఇక శికంజా మాలిక్ అనే క్రూరమైన విలన్ పాత్రలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు అదరగొట్టారు. కొన్ని సీన్లలో అయితే మోహన్ బాబు నట విశ్వరూపం చూపించారని క్రిటిక్స్ చెబుతున్నారు. ఇక సినిమాకు మొదటి రోజే మిక్స్ డ్ టాక్ వచ్చినా కలెక్షన్లు మాత్రం ఓ రేంజ్ లో వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు రెండు రోజుల్లో కలిపి రూ. 114 కోట్ల వసూళ్లు వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది .ఈ నేపథ్యంలో ది ప్యారడైజ్ చిత్ర బృందం శనివారం (సెప్టెంబర్ 26) సక్సెస్ మీట్ నిర్వహించింది. నాని, శ్రీకాంత్ ఓదెల, మోహన్ బాబుతో సహా చిత్ర బృందమంతా ఈ కార్యక్రమానికి హాజరైంది. ఈ సందర్భంగా మాట్లాడిన మోహన్ బాబు చాలా ఎమోషనల్ అయ్యారు.ఈ సందర్భంగా తనకు తమ్ముడిలాంటి గద్దర్‌ను గుర్తుచేసుకున్నారు మోహన్ బాబు. గద్దర్ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని చెబుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'నాకు తమ్ముడి లాంటి వారు గద్దర్. ఆయన పిల్లలు మా స్కూల్‌లోనే చదువుకున్నారు. రచయితలు అంటే నాకు చాలా ఇష్టం' అని ఎమోషనల్ అయ్యారాయన. ఈ సందర్భంగా ఓ రచయిత మృతి చెందిన విషయం తనకు తెలిసిందని గుర్తుచేసుకున్న మోహన్‌బాబు.. ఆయన కుమారుడిని వేదికపైకి పిలిపించి మాట్లాడారు. అతడు ప్రస్తుతం ఏం చదువుతున్నాడని అడిగారు. ఫార్మసీ చదువుతున్నానని అతడు చెప్పడంతో.. "మా దగ్గర ఎం.ఫార్మసీ కూడా ఉంది" అని మోహన్‌బాబు తెలిపారు.ఇదే వేదికగా అతడికి రెండు సంవత్సరాల పాటు ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు మోహన్ బాబు. 'నువ్వు బాగా చదువుకుని గొప్పవాడివి అవ్వాలి" అంటూ సదరు విద్యార్థిని ఆశీర్వదించారు.ది ప్యారడైజ్ సక్సెస్ మీట్ వేదికగా మోహన్‌బాబు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పైకి గంభీరంగా కనిపించినా మోహన్ బాబు చాలా మంచి వారని, ఆయన విద్యకు చాలా ప్రాధాన్యమిస్తారని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పుడు ఒక విద్యార్థికి ఉచిత విద్య ప్రసాదించడం ద్వారా మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారని కామెంట్స్ చేస్తున్నారు.

## నాని 'ది ప్యారడైజ్' సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా



నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ది ప్యారడైజ్ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబడుతోంది. మొదటి షోకే మిక్స్ డ్ టాక్ వచ్చినప్పటికీ ఈ సినిమాకు రికార్డు కలెక్షన్లు వస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమా రెండు రోజులకు కలిపి ఏకంగా 114 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్లు చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ లో నాని జడల్ అనే పాత్రలో అద్భుతంగా నటించాడు. అలాగే హీరోయిన్ గా కయాదు లోహర్ సుబ్బు అనే పాత్రలో క్యూట్ గా కనిపించింది. వీరితో పాటు మోహన్ బాబు, రాఘవ్ జుయెల్, సంపూర్ణేష్ బాబు, సోనాల్ కులకర్ణి తదితరులు ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషించారు. ఇదిలా ఉంటే రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోన్న ది ప్యారడైజ్ సినిమా గురించి ఒక ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే.. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం ముందుగా కయాదు లోహర్ ను ఎంపిక చేయలేదట. వేరొ స్టార్ హీరోయిన్ ఈ సినిమాని రిజెక్ట్ చేయడంతో తిరిగి చిత్ర నిర్మాతలు కయాదును ఎంపిక చేశారని తెలుస్తోంది. మరి మొదటగా సుబ్బు పాత్ర కోసం దర్శక నిర్మాతలు అనుకున్న స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా?దేవర సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీకి పరిచయమైంది బాలీవుడ్ క్రేజీ హీరోయిన్ జాన్వీ కపూర్. ఈ సినిమా తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న ఆమె రామ్ చరణ్ పెద్ది సినిమా చేసింది. అయితే పెద్దితో పాటు ది ప్యారడైజ్ సినిమా కోసం కూడా జాన్వీని సంప్రదించారు మేకర్స్. అయితే అప్పటికే పెద్ది సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడంతో జాన్వీ కపూర్ నాని ది ప్యారడైజ్ సినిమాను వదులుకుందని తెలుస్తోంది. దీంతో దర్శక నిర్మాతలు సుబ్బు పాత్ర కోసం కయాదు లోహర్ ఎంపిక చేశారని తెలుస్తోంది. అయితే ది ప్యారడైజ్ సినిమాలో కయాదు రోల్ కు పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వలేదన్న టాక్ వినిపిస్తోంది. మరి ఒక వేళ జాన్వీ గనక ఈ రోల్ చేసి ఉంటే సినిమా రిజల్ట్ ఎలా ఉండేదోనని సినీ అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు.ది ప్యారడైజ్ సినిమా విషయానికి వస్తే.. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ (ఎస్ఎల్‌వి సినిమాస్) బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ మూవీని నిర్మించారు. అనిరుధ్ ఈ మూవీకి స్వరాలు సమకూర్చారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లోనూ ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది.